ప్రారంభమెప్పుడో..?

పూర్తయిన షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణ పనులు

షట్టర్ల ప్రారంభానికి

చిరు వ్యాపారుల ఎదురుచూపులు

మండల కేంద్రంలో నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్

కడ్తాల్, జూలై 14: మండల కేంద్రంలో లక్షలు వెచ్చించి నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్ నిరుపయోగంగా మారింది. పట్టణంలోని పాలశీతలీకరణ కేంద్రానికి ఆర్థిక వనరులు సమకూర్చేందుకు వీలుగా.... షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణాన్ని చేపట్టాలని ప్రభుత్వానికి ప్రజాప్రతినిధులు, అధికారులు పలుమార్లు విన్నవించారు. ఈ మేరకు హైదరాబాద్-శ్రీశైలం ప్రధాన రహదారిని అనుకొని షాపింగ్ కాంప్లెక్ నిర్మించేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో రాష్ట్ర పాడి పరిశ్రమాభివృద్ధి సహకార సంస్థ ఆధ్వర్యంలో 2022 జనవరి నెలలో, రూ.46 లక్షలతో చేపట్టిన షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి ప్రస్తుత కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, అప్పటి మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ శంకుస్థాపన చేశారు. షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణాన్ని శరవేగంగా చేపట్టడంతో పనులు త్వరగా పూర్తి కావడం జరిగింది. షాపింగ్ కాంప్లెక్స్ ఎప్పుడు ప్రారంభం అవుతుందోనని దాదాపు రెండు సంవత్సరాలుగా నాయకులు, చిరు వ్యాపారులు ఎదురు చూస్తున్నారు.

నిరుపయోగంగా షట్టర్లు...

పాలశీతలీకరణ కేంద్రం ఆవరణలో షట్టర్లను నిర్మించి దాదాపు రెండేళ్లు అవుతుంది. లక్షలతో నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్ నిరుపయోగంగా మారడంతో షటర్ల పరిసరాలలో చెత్తా చెదారంతో నిండిపోయింది. కాంప్లెక్స్ పరిసరాలలో చెత్తను వేయడంతోపాటు పందులు స్వైర విహారానికి తోడు, దోమలు, ఈగలు బెడద ఎక్కువై దుర్గంధం వెదజల్లుతున్నది. కాంప్లెక్స్‌లోని షట్టర్లను వేలం వేయకపోవడం, కిరాయిలకు ఇవ్వకపోవడంతో చిరు వ్యాపారస్తులు ఆవేదన చెందుతున్నారు. వీటిపి అద్దెకు తీసుకొని ఉపాధి పొందుదామని ఎదురు చూస్తున్న యువత నిరాశ చెందుతున్నారు. కాంప్లెక్స్ ప్రారంభించడంలో జరుగుతున్న జాప్యంపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

వ్యాపారం వృద్ధి చెందుతుంది...

మండల కేంద్రంలో నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్ ప్రారంభమవుతే, పట్టణ రూపురేఖలు మారిపోయి వ్యాపారం వృద్ధి చెందే అవకాశాలు మెండుగా ఉన్నాయి. జాతీయ రహదారి పక్కనే పది షట్టర్లు నిర్మించడంతో తమ వ్యాపారాలు బాగా జరుగుతాయని చిరు వ్యాపారులు భావిస్తున్నారు. రోడ్డు విస్తరణలో చిరువ్యాపారస్తుల డబ్బాలు తొలగించడంతో ఎన్నో కుటుంబాలు ఉపాధిని కోల్పోయాయి. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు చిరు వ్యాపారులు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని కాంప్లెక్స్‌ని ప్రారంభించాలని కోరుతున్నారు.

ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం...

పాలశీతలీకరణ కేంద్రం ఆవరణలో నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్ ప్రారంభించడానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించడం జరిగింది. స్థానిక నాయకుల, చిరు వ్యాపారులు అందించిన వినతులను ఉన్నతాధికారులకు అందజేశాం. టెండర్లు ప్రక్రియ పూర్తి చేసి షాపింగ్ కాంప్లెక్స్ ప్రారంభించేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. త్వరగా కాంప్లెక్స్‌ను ప్రారంభించేందుకు అన్ని రకాల పనులు పూర్తి చేస్తున్నాం.

- రాధిక, పాలశీతలీకరణ కేంద్రం మేనేజర్, కడ్తాల్

కాంప్లెక్స్‌ని వెంటనే ప్రారంభించాలి

మండల కేంద్రంలో లక్షలు వెచ్చించి నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్‌లోని షట్టర్లు నిరుపయోగంగా మారాయి. వీటిని వెంటనే ప్రారంభించాలని సంబంధిత శాఖ అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదు. జాతీయ రహదారి రోడ్డు విస్తరణలో డబ్బాలు కోల్పోయిన చిరు వ్యాపారులు, షాపింగ్ కాంప్లెక్స్ ప్రారంభం కోసం ఎదురు చూస్తున్నారు. వెంటనే అధికారులు కాంప్లెక్స్ ప్రారంభించి చిరు వ్యాపారులను ఆదుకోవాలి.

-లక్ష్మీనర్సింహారెడ్డి, మాజీ సర్పంచ్, కడ్తాల్

అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరు

యాచారం : పోలీసుల అదుపులో బీఆర్ఎస్, బీజేపీ నాయకులు

యాచారం, జూలై14: ముందస్తు అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని బీఆర్ఎస్ నియోజకవర్గ యువజన విభాగం ఉపాధ్యక్షుడు మహ్మద్ ఖాజుమొయినుద్దీన్ అన్నారు. అబ్దుల్లాపూర్‌మెట్ మండలం లష్కర్‌గూడలో సీఎం కార్యక్రమం ఉండటంతో బీఆర్ఎస్, బీజేపీ నాయకులను పోలీసులు ముందస్తు అరెస్టులు చేశారు. యాచారం, హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటి పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో ఉన్న బీఆర్ఎస్, బీజేపీ నాయకులను ఆదివారం తెల్లవారు జామునే పోలీసులు ఇళ్ల వద్దకు వెళ్లి నాయకులను అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నియోజకవర్గ యువజన విభాగం ఉపాధ్యక్షుడు మహ్మద్ ఖాజుమొయినుద్దీన్ మాట్లాడుతూ..రాష్ట్రంలో కాంగ్రెస్ నిర్బంధ పాలన కొనసాగుతుందన్నారు. అధికార పార్టికి సబంధించి ఏ చిన్న కార్యక్రమం జరిగినా బీఆర్ఎస్ నాయకులను ముందస్తు అరెస్టు చేయడం సిగ్గు చేటన్నారు. కాంగ్రెస్ పాలన పేరుకే ప్రజా పాలన అని, ప్రజాపాలన సభలకు మాత్రం ప్రతిపక్ష గొంతులకు సంకెళ్లు వేస్తుందని మండిపడ్డారు. ప్రజా వ్యతిరేక విధానాలను ప్రశ్నిస్తూ, నిరుద్యోగుల సమస్యలను పరిష్కరించాలని పోరాటం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులపై ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతుందని ద్వజమెత్తారు. ముందస్తు అరెస్టులతో ప్రజా ఉద్యమాలను ఆపలేరని హెచ్చరించారు. ఎన్ని కుట్ర, కుతంత్రాలకు పాల్పడినా డీఎస్సీ, గ్రూప్2 అభ్యర్థులకు అండగా బీఆర్ఎస్ పోరాడుతుందన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకుడు సిరమోని శేఖర్, ఐలేశ్, శివ పాల్గొన్నారు.

అక్రమ అరెస్ట్‌లు సరికాదు..

ఆదిబట్ల : అక్రమ అరెస్ట్‌లతో ఉద్యమాన్ని ఆపలేరని ఆదిబట్ల మున్సిపాలిటీ బీఆర్ఎస్ సోషల్‌మీడియా కన్వీనర్ ఎరుకల ప్రసాద్ అన్నారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో ఆదివారం ఉదయం ముఖ్యమంత్రి పర్యటన ఉండటంతో ఆదిబట్ల పోలీసులు బీఆర్ఎస్ నాయకులను ముందస్తు అరెస్ట్‌లు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు అమలు చేసే వరకు ప్రజాక్షేత్రంలో నిలదీస్తామని అన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

బాల్‌రాజ్ (ఫైల్)

చేవెళ్ల రూరల్, జూలై 14 : గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన చేవెళ్ల పోలీస్ స్టేషన్ పరిధిలో చేసుకున్నది. ఎస్ఐ ప్రదీప్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. హస్తేపూర్ గ్రామానికి చెందిన కుంటనోళ్ల బాల్‌రాజ్ (34) శనివారం రాత్రి ఇంట్లో కుటంబ సభ్యులతో గొడపడి తన సైకిల్‌పై చేవెళ్లకు బయల్దేరాడని, మార్గం మధ్యలో దామరగిద్ద గేట్ సమీపంలోని హెచ్‌పీ పెట్రోల్ పంపు వద్దకు రాగానే గుర్తు తెలియని వాహనం ఢీకొని తలకు బలమైనం గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. భార్య కుంటనోళ్ల రాణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ ప్రదీప్‌కుమార్ తెలిపారు.

మత్స్య పారిశ్రామిక సంఘం అభివృద్ధికి కృషి

సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న సంఘం మండల గౌరవ అధ్యక్షుడు చక్రపాణి

మంచాల, జూలై 14: మత్స్య పారిశ్రామిక సంఘం అభివృద్ధికి కృషి చేయనున్నట్లు ఆ సంఘం మండల గౌరవ అధ్యక్షుడు చింతకింది చక్రపాణి అన్నారు. ఆదివారం మంచాల మండలం నోముల గ్రామంలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మత్స్య కార్మికుల సంక్షేమ అభివృద్ధి కోసం తాను నిరంతరం పనిచేయనున్నట్లు చెప్పారు. ప్రభుత్వం మత్స్య కారులకు ఉచిత చేప పిల్లల స్కీమ్‌ను కొనసాగించాలని కోరారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు చింతకింది జంగయ్య పాల్గొన్నారు.

అనాథ శరణాలయానికి గుర్తు తెలియని వ్యక్తి తరలింపు

యాచారం, జూలై14: మండల కేంద్రంలోని తిరుమలేశుని గుట్ట సమీపంలో ఉన్న గుర్తు తెలియని వ్యక్తిని ఆదివారం పోలీసులు గుర్తించారు. అతడు మతి స్థిమితం లేని వ్యక్తిగా గుర్తించిన పోలీసులు అతడిని మంచాల మండలం ఆగపల్లిలో ఉన్న మానవసేవ అనాథ శరణాలయానికి తరలించారు. దీంతో పోలీసులు చేసిన సేవా దృక్పథానికి స్థానిక ప్రజలు అభినందిస్తున్నారు. ఎవరైనా అతడి కుటుంబ సభ్యులు పోలీసులను ఆశ్రయిస్తే వారికి అప్పగించనున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కు అందజేత

చెక్కును అందజేస్తున్న నిరంజన్‌రెడ్డి

మంచాల, జూలై 14: సీఎం సహాయనిధి పేదలకు వరంలాంటిదని కాంగ్రెస్ పార్టీ నాయకుడు మర్రి నిరంజన్‌రెడ్డి అన్నారు. మంచాల మండలం పీసీతండాకు చెందిన మెగావత్ గమ్యానాయక్‌కు రూ.16వేలు, రామునాయక్‌కు రూ.47వేలు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సహకారంతో మంజూరైన చెక్కులను ఆదివారం మర్రి నిరంజన్‌రెడ్డి లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మెగావత్ గణేశ్, వినోద్‌కుమార్, ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

చెరువుల సుందరీకరణకు ప్రత్యేక చర్యలు

కొండాపూర్, జూలై 14 : చందానగర్ డివిజన్ పరిధి దీప్తిశ్రీనగర్ కాలనీలోని రేగులకుంట చెరువు సుందరీకరణ పనులను ఆదివారం నియోజకవర్గం ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ పరిశీలించారు. రూ.కోటి 50 లక్షల వ్యయంతో సేల్స్ ఫోర్స్ ఐటీ సంస్థ సీఎస్ఆర్ నిధులతో సుందరీకరణ పనులను పూర్తి చేసింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... చెరువుల పునరుద్ధరణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ఆమనగల్లు : సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

మొయినాబాద్ : హిమాయత్‌నగర్ గ్రామంలో..

ఆమనగల్లు, జూలై 14: ఆమనగల్లు జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో చదివిన 1989-90 పదో తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం పట్టణంలోని భవానీ గార్డెన్‌లో జరిగింది. ఈ సందర్భంగా వారికి విద్యాబుద్ధులు నేర్పి తమ భవిష్యత్తుకు బాటలు వేసిన అనాటి ఉపాధ్యాయులు ఖాజామైనోద్దీన్, సత్యనారాయణలను సత్కరించారు. చదువుకున్న పాఠశాలలో మౌలిక వసతుల కల్పనకు తోడ్పాటునందించాలని బాల్యమిత్రులు తీర్మానించారు. ఈ సందర్భంగా అంతర్జాతీయ స్విమ్మర్ క్వీని విక్టోరియాను సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు హరిప్రసాద్, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీధర్, రమేశ్, నర్సింహ, శశికిరణ్, మౌనిక, రేవతి, వాణి, గీత, జ్యోతి, రామేశ్వరమ్మ, సద్గుణ, మంజుల, శోభ పాల్గొన్నారు.

ఆమనగల్లులో..

ఆమనగల్లు : మండల పరిధిలోని ఆకుతోటపల్లి గ్రామంలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1992-1993లో పదో తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం హైదరాబాద్‌లోని ఎన్‌విలేజ్ కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించారు. దాదాపు 31 సంవత్సరాల కలుసుకొని ఆపాయ్యంగా పలకరించుకున్నారు.

మొయినాబాద్‌లో..

మొయినాబాద్, జూలై 14 : మండల పరిధిలోని హిమాయత్‌నగర్ గ్రామంలో 2008-09 విద్యా సంవత్సరంలో 10 తరగతి పూర్తి చేసిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. పాఠశాలలోని నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుని యోగ క్షేమాలను తెలుసుకున్నారు.

పారా అథ్లెటిక్స్ జాతీయ పోటీల్లో సత్తా చాటాలి

- అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు ముత్తినేని వీరయ్య వర్మ
- క్రీడాకారులకు టీ షర్టులు పంపిణీ

పారా అథ్లెటిక్ క్రీడాకారులకు టీషర్ట్‌లను పంపిణీ చేసిన అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు, దివ్యాంగుల ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య వర్మ

మలక్‌పేట, జూలై 14: జాతీయ స్థాయి పారా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో సత్తా చాటి రాష్ట్రానికి పేరు తేవాలని పారా అథ్లెటిక్స్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు, రాష్ట్ర దివ్యాంగుల ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య వర్మ అన్నారు. తెలంగాణ పారా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 15 నుంచి 17 వరకు బెంగుళూరులో జరగనున్న 13వ జాతీయ స్థాయి జూనియర్ అండ్ సబ్ జూనియర్ పారా అథ్లెటిక్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొనన్నున్న 15 మంది రాష్ట్ర క్రీడాకారులకు అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆయన టీ షర్ట్‌లను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా వీరయ్య వర్మ మాట్లాడుతూ దివ్యాంగులను క్రీడల్లో ప్రోత్సహించేలా స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ క్రీడల్లో పారాఅథ్లెటిక్స్ క్రీడలను చేర్చుతూ ఉత్తర్వులు జారీ చేసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కాగా ఈ పోటీలకు ఇద్దరు కోచ్‌లు, ఇద్దరు మేనేజర్లు ప్రాతినిధ్యం వహిస్తున్నారని పారా అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గడిపల్లి ప్రశాంత్ తెలిపారు. క్రీడల్లో మెరుగ్గా రాణించాలని ఆకాంక్షించారు.

రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు

కందుకూరులో రేషన్ దుకాణాన్ని తనిఖీ చేస్తున్న నాయబ్ తాసీల్దార్ రఘునందన్

కందుకూరు, జూలై 14: రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎన్‌ఫోర్స్‌మెంట్ నాయబ్ తాసీల్దార్ రఘునందన్ హెచ్చరించారు. ఆదివారం నాయబ్ తాసీల్దార్ మండలంలోని వివిధ గ్రామాల్లోని రేషన్ షాపులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లబ్ధిదారులు రేషన్ షాపుల్లో బియ్యం తీసుకుని దళారులకు విక్రయిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, బియ్యం కొనుగోలు చేస్తున్న వ్యక్తులను గుర్తించి వారిపై పీడీ యాక్టును నమోదు చెస్తామని హెచ్చరించారు. అదేవిధంగా డీలర్లు కొందరు లబ్ధిదారుల వద్ద బియ్యం కొనుగోలు చేసి ఎక్కువ ధరలకు రైస్ మిల్లర్లకు విక్రయిస్తున్నట్లు సమాచారం ఉందని, అలాంటి డీలర్ల దుకాణాలను రద్దు చేసి కేసులు నమోదు చేస్తామని ఆయన హెచ్చరించారు. బియ్యం కొనుగోలు చేసే రైస్ మిల్లర్ల యజమానులపైనా చర్యలు తీసుకుంటామని తెలిపారు. లబ్ధిదారులు బియ్యాన్ని ఎవరికీ విక్రయించవద్దని సూచించారు.

వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

మాడ్గుల, జూలై: వాహనదారులు ప్రభుత్వం కొత్తగా అమలు చేసిన నిబంధనలు తప్పక పాటించాలి అని మాడ్గుల సీఐ నాగరాజుగౌడ్ అన్నారు. ఆదివారం ఆయన పోలీస్ సిబ్బందితో కలిసి మాడ్గుల ఇంద్రాగాంధీ చౌరస్తాలో వాహనాలను తనిఖీ చేశారు. అనంతరం సీఐ మాట్లాడుతూ అతి వేగంగా డ్రైవింగ్ చేస్తే కేసులు నమెదు చెస్తామని హెచ్చరించారు. నిబంధనలు ఉల్లఘించిన వారిపై కేసులు నమోదు చేయడంతో పాటు జరిమానాలు విధిస్తామన్నారు. శాంతి భద్రతల పరిరక్షణలో ప్రజలు కూడా భాగస్వాములు కావాలని ఆయన సూచించారు.

కాలనీల్లో పర్యటించిన బడంగ్‌పేట మేయర్

బడంగ్‌పేట, జూలై14 : బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని గ్రీన్‌రిచ్ కాలనీ, శ్రీవిద్య టౌన్‌షిప్‌లో బోనాల ఉత్సవ ఏర్పాట్లను ఆదివారం మేయర్ పారిజాతనర్సింహారెడ్డి పరిశీలించారు. అల్మాస్‌గూడలోని తిరుమలనగర్‌లో జరిగిన సిత్లా పండుగ కార్యక్రమంలో పాల్గొన్నారు. కాలనీల్లో పర్యటించి బోనాల పండుగకు త్వరగా ఏర్పాట్లు పూర్తి చేయాలని నిర్వాహకులకు సూచించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు, కాలనీ అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల సేవలు ఎంతో గొప్పవి

పారిశుధ్య కార్మికుల సన్మాన కార్యక్రమంలో పాల్గొన్న వైస్ చైర్మన్ కె.నరేందర్‌రెడ్డి తదితరులు

మణికొండ, జూలై 14: పారిశుధ్య కార్మికుల సేవలు ఎంతో గొప్పవని, వారి పనికి తగిన గుర్తింపు ఇవ్వాలని మణికొండ మున్సిపాలిటీ వైస్ చైర్మన్ కె.నరేందర్‌రెడ్డి అన్నారు. భారత్ వికాస్ పరిషత్ తెలంగాణ ప్రాంత ఎన్విరాన్‌మెంటల్ కన్వీనర్ రఘు సతీశ్‌కుమార్, ఏఐసీఎస్సీ ప్రెసిడెంట్ రామానుజ, ఏఐసీఐసీ ప్రెసిడెంట్ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఆదివారం మణికొండ మున్సిపాలిటీ పారిశుధ్య కార్మికులకు సన్మాన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మికులను ఘనంగా సన్మానించి వారి సేవలను కొనియాడారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రజలు మేల్కొనక ముందే బస్తీల్లోని వీధిని, ఊరిని ప్రజల కోసం ముస్తాబు చేస్తారన్నారు. చీపురు పట్టి ఊడ్చి వెన్నునొప్పితో బాధపడే కార్మికులు వారు పడే కష్టానికి తగిన గుర్తింపు ఎంతో అవసమన్నారు. ఈ సందర్భంగా సుమారు 270 మంది కార్మికులను ఘనంగా సన్మానించామన్నారు. కార్యక్రమంలో మణికొండ మున్సిపల్ కమిషనర్ ప్రదీప్‌కుమార్, కౌన్సిలర్స్ శ్రీకాంత్‌స్వామి, శైలజ, పద్మారావు, కోఆప్షన్ సభ్యులు సిద్దప్ప, లక్ష్మి, మాజీ ఎంపీటీసీ ఎం.రాఘవరెడ్డి, మున్సిపల్ బీజేపీ అధ్యక్షుడు సి.బీరప్ప, నాయకులు సీహెచ్ ఇందిర, ప్రభావతి, బి.రవికాంత్‌రెడ్డి, ఆనంద్‌రావు, శివ రాంరెడ్డి, ఎంప్లాయిస్ కాలనీ చైర్మన్ పి.జంగయ్య, అధ్యక్షుడు పెంటారెడ్డి, అడ్వైజర్ బాబ్జి, కాలనీలవాసులు పాల్గొన్నారు.

చేవెళ్లలో ఘనంగా బోనాలు

చేవెళ్లటౌన్, జూలై 14: చేవెళ్ల మండల కేంద్రంలోని వీరభద్ర కాలనీలో ఆదివారం బోనాల పండుగను ప్రజలు ఘనంగా జరుపుకొన్నారు. ఉదయం నుంచి పోచమ్మ తల్లికి పూజలు చేశారు. మహిళలు బోనాలతో ఊరేగింపుగా పోచమ్మతల్లి దేవాలయాని వెళ్లి నైవేద్యం సమర్పించారు. పోతరాజుల విన్యాసాలు ఆకర్షణగా నిలిచాయి. కార్యక్రమంలో నాయకులు శంకర్, గుత్తి మల్లేశ్, రాములు పాల్గొన్నారు.

తట్టిఅన్నారం వైఎస్సార్ కాలనీలో సంచరిస్తున్న కుక్కలు

కుక్కల బెడదను నివారించండి

పెద్దఅంబర్‌పేట, జూలై 14: మున్సిపాలిటీ పరిధి తట్టిఅన్నారంలో కుక్కల బెడద ఎక్కువయింది. వీధుల్లో పదుల సంఖ్యలో కుక్కలు గుంపులుగా తిరుగుతున్నాయి. చిన్నారులు, వృద్ధులు వాటిని చూస్తేనే జంకుతున్నారు. ప్రతిరోజూ ఒకరిపైననైనా దాడి చేస్తున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక ప్రధాన రహదారిపై సైతం కుక్కలు తిరుగుతూ రోడ్డు ప్రమాదాలకు కారణమవుతున్నాయి. చెత్తచెదారాలను రోడ్లపై పడేస్తుండటంతో దుర్గంధం వస్తున్నదని చెబుతున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి కుక్కల బెడదను తీర్చాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

వైభవంగా జగన్నాథస్వామి రథయాత్ర

ఆర్కేపురం, జూలై 14 : ఇస్కాన్ సొసైటీ ఆధ్వర్యంలో శ్రీరామకృష్ణాపురం కాలనీలో జగన్నాథ స్వామి రథయాత్ర వైభవంగా నిర్వహించారు. కాలనీ వాసులు, భక్తులు వేల సంఖ్యలో పాల్గొని శ్రీకృష్ణ నామస్మరణ చేస్తూ ఆధ్మాత్మిక అనుభూతి పొందారు. చిన్నారులు, వృద్ధులు పోటాపోటీగా రథాన్ని లాగారు. రథయాత్రలో స్థానిక కార్పొరేటర్ రాధాధీరజ్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర యువజన నాయకుడు చిలుక ఉపేందర్‌రెడ్డి, కాలనీ సొసైటీ సభ్యులు రమేశ్‌బాబు, రాజశ్రీరామారావు, వెంకటేశ్వర్లు, నరహరిరావు, ఆంజనేయప్రసాద్, గణేశ్‌బాబు,భరత్, శ్రవణ్, అన్నపూర్ణ, విజయలక్ష్మి, రాధ, నీలిమ, సుజాత, మునిపల్లె శ్రీనివాస్, ఇస్కాన్ ప్రతినిధులు శ్రీనివాస్, నరసింగ్‌రావు పాల్గొన్నారు.

చెత్తతో బేజారు..

స్వచ్ఛత సాధనకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు ప్రకటనలకే సరిపోతున్నాయి. స్వచ్ఛత సాధన కోసం ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలతో అధికార యంత్రాంగం రెండు మూడు రోజుల హడావిడి చేసి ఫొటోలతో సరిపెట్టుకుంటున్నారు. ఆ తర్వాత పరిస్థితులు ఎక్కడేసిన గొంగడి అక్కడే అన్నట్లుగా చెత్త కుప్పలు పేరుకుపోతున్నాయి. దీనికి నిదర్శనంగా శేరిలింగంపల్లి సర్కిల్-20 పరిధి కొండాపూర్ డివిజన్ ప్రేమ్‌నగర్ బీ బ్లాక్ 40 ఫీట్ రోడ్డులో కుప్పలు తెప్పలుగా చెత్త కుప్పలు దర్శనమివ్వడమే. ఫిర్యాదు చేసిన ప్రతీసారి అధికారులు హడావిడి చేసి చెత్తను తొలగించడంతోనే సరిపెట్టుకుంటున్నారే తప్పా, శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవడం లేదంటూ స్థానికులు వాపోతున్నారు. ఇకనైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికులు కోరుతున్నారు.

- కొండాపూర్, జూలై 14